ప్రజాశక్తి
గురువారం 16 అక్టోబర్ 2025
5
అనంతపురం





ఐద్వా నూతన రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు

చైతన్య భరితం.. భవిష్యత్ దిశానిర్దేశం..!

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ బుధవారం సాయంత్రంతో ముగిసింది. మూడు రోజులపాటు అనంతపురం నగరంలోని ఎంకెఎం ఫంక్షన్ హాలులో ఉత్తేజపూరిత వాతావరణంలో రాష్ట్ర మహాసభ జరిగింది. రాష్ట్రంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు వాటి పరిష్కారం.. భవిష్యత్తు పోరాటాలపై మహాసభ వేదికగా సుదీర్ఘ చర్చలు జరిపారు. మహాసభలు ఆద్యంతం అర్థవంతంగానూ, నిర్మాణాత్మంగానూ జరిగాయి. ఐద్వా మహిళా సంఘాన్ని రాబోయే రోజుల్లో మరింత అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామంటూ ప్రతినిధులు ఉద్యమ చైతన్య స్ఫూర్తితో తెలియజేశారు.



మహాసభలకు హాజరైన ఐద్వా ప్రతినిధులు

- అనంతలో ముగిసిన ఐద్వా 16వ రాష్ట్ర మహాసభ
- మూడు రోజుల పాటు ఉత్సాహభరితంగా మహాసభలు
- మహిళా సమస్యలపై సుదీర్ఘచర్చలు
- భవిష్యత్తు పోరాటాలపై కార్యాచరణ
- ఐద్వా నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక
- జిల్లా నుంచి ఐదుగురికి చోటు



మహాసభల ముగింపు సందర్భంగా అభివాదం చేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

ఐద్వా 16వ రాష్ట్ర మహాసభకు రాష్ట్రంలోని 26 జిల్లాల నుంచి 400 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మూడు రోజుల మహాసభలో జాతీయ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీమతి టీచరు, మరియం ధావలేలతోపాటు కోశాధికారి పుణ్యవతి పాల్గొన్నారు. రాష్ట్ర మహాసభల మొత్తాన్ని వారు పరిశీలించారు. మొదటి రోజు బహిరంగ సభతో మహాసభ ఆరంభమైంది. ఈ మహాసభ ప్రారంభోత్సవానికి సామాజికవేత్త తీస్తా సెతల్వాద్ విచ్చేశారు. ఆమె ప్రస్తుతం దేశంలో పరిస్థితులు ఏ రకంగా ఉన్నాయన్నది వివరించారు. మతోన్మాదం పెచ్చుమీరిపోయి హింస పెరుగుతోందని చెప్పారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా మహిళలు ఐక్యమై పోరాడాలని సూచించారు. రెండవ రోజు రాష్ట్రంలో ఐద్వా చేపట్టిన కార్యక్రమాలను కార్యదర్శి రమాదేవి నివేదిక ప్రవేశపెట్టారు. అనంతరం జిల్లాల వారీగా ప్రతినిధులు చర్చల్లో వారి జిల్లాలోని మహిళల పరిస్థితులు వాటి పరిష్కారానికి ఐద్వా చేపట్టిన కార్యక్రమాలు అన్నింటినీ సమీక్షించారు. రోజంతా సుదీర్ఘంగా ఈ చర్చలు నడిచాయి. రాష్ట్రంలో ప్రధానంగా మైక్రో ఫైనాన్స్ ఆగడాలు మితిమీరిపోతున్నాయని, ప్రజలు అప్పుల ఊబిలో కూరుకుపోయి ఉన్నారని చర్చల్లో తెలిపారు. వడ్డీ రేట్లు 200 శాతం కంటే ఎక్కువగా ఉంటున్నాయని చర్చించారు. వీటిని కట్టడి చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. దీనిపై పోరాటాలకు సన్నద్ధమవ్వాలని చర్చించారు. డ్వాక్రా సంఘాల్లో అవినీతిపెరగడం ఒక ఎత్తైతే, బ్యాంకులు కూడా అధిక వడ్డీలు వీరి నుంచి వసూలు చేస్తున్నాయన్న అంశం రెండో రోజు చర్చల్లో ముందుకొచ్చింది. మహాసభ మూడవ రోజు సబ్ కమిటీలు ఏర్పాటు చేసి వివిధ అంశాలపై లోతుగా చర్చించారు. రాబోయే కాలంలో ఎటువంటి కార్యక్రమాలను రాష్ట్రంలో ఐద్వా చేపట్టాలని భవిష్యత్ కార్యచరణ రూపొందించారు. ఇదే సమయంలో ఐద్వాను మరింత బలోపేతం చేయడానికి ఎటువంటి కృషి రాష్ట్రంలో జరగాలన్న దానిని ఐద్వా జాతీయ నాయకులు మరియం ధావలే, శ్రీమతి టీచర్, ఎస్.పుణ్యవతిలు దిశానిర్దేశం చేశారు. దేశంలో మతత్వం పెరుగుతన్న నేపథ్యంలో ఇక్కడి రాష్ట్ర ప్రభుత్వం బిజెపితో కలసి కూటమిగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చే ప్రయత్నాలు పెరిగే అవకాశమందని చెప్పారు. అందుకై ఐద్వా ప్రజల మధ్య ఐక్యత పెంచే దిశగా కృషి ఉండాలని జాతీయ నాయకులు సూచించారు. మొత్తంగా మూడు రోజులపాటు నగరంలో జరిగిన మహాసభలు అర్థవంతంగానూ, నిర్మాణాత్మంగానూ జరిగాయి. ఉత్సహపూరిత వాతావరణంలో చర్చలు జరిగాయి. ఈ మహాసభకు వచ్చిన ప్రతినిధులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఐద్వా మహిళా సంఘాన్ని రాబోయే రోజుల్లో మరింత అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తామంటూ ఉత్సహంతో వెనుదిరిగి వెళ్లారు.

జిల్లా నుంచి రాష్ట్ర కమిటీలోకి ఐదుగురు



ఐద్వా నూతన రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులతో జాతీయ నాయకులు

అనంతపురం జిల్లా నుంచి రాష్ట్ర కమిటీకి ఐదుగురు సభ్యులు ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా నుంచి ఒకరు ఎన్నికయ్యారు. అనంతపురం జిల్లా నుంచి ఎన్నికైన వారిలో వి.సావిత్రి ఐద్వా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గతంలో రాష్ట్ర కోశాధికారిగా ఉన్నారు. ఇప్పుడు రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికయ్యారు. రాష్ట్ర కమిటీ కార్యవర్గంలో చంద్రిక ఎన్నికవగా, శ్యామల, అశ్విని, జ్యోతిలు రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఎన్నికయ్యారు. సత్యసాయి జిల్లా నుంచి శ్రావణి ఎన్నికయ్యారు.

ఎసిబి వలలో లోకల్ ఆడిట్ అధికారి

ప్రజాశక్తి-అనంతపురం

అవినీతి నిరోధక శాఖ అధికారుల వలలో ఆడిట్ అధికారి పడ్డారు. మున్సిపల్ రిటైర్డు ఉద్యోగి నుంచి ఎనిమిది వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డారు. దీనికి సంబంధించి వివరాలు ఈ విధంగా అన్నాయి. రిటైర్డు మున్సిపల్ ఉద్యోగి శ్రీనివాసులుకు పింఛను డబ్బులు మంజూరు చేయడానికి లోకల్ ఆడిట్ అధికారి లక్ష్మినారాయణ రూ.10వేలు డిమాండ్ చేశారు. రూ.8వేలు ఇవ్వడానికి శ్రీనివాసులు అంగీకరించారు. ఈ ఎనిమిది వేల రూపాయలను బుధవారం సాయంత్రం కార్యాలయం అటెండర్ నూర్‌మహమ్మద్ ద్వారా నగరంలోని జిల్లా పరిషత్ ఆవరణంలో ఉన్న ఆడిట్ కార్యాలయంలో తీసుకుంటూ ఉండగా అవినీతి నిరోధక శాఖ అధికారులు దాడులు చేసి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మొదట డబ్బులు తీసుకున్న నూర్‌మహమ్మద్‌తోపాటు, లక్ష్మినారాయణను అదుపులోకి తీసుకుని అరెస్టు చేసినట్టు అనంతపురం అవినీతి నిరోధక శాఖ అధికారి తెలిపారు.



డబ్బులు తీసుకుంటూ ఎసిబి అధికారులకు పట్టుబడ్డ లోకల్ ఆడిట్ అధికారి లక్ష్మినారాయణ

మెరుగైన వైద్య సేవలు అందించాలి

ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

వివిధ ప్రాంతాల నుంచి అనంతపురం ప్రభుత్వ సర్వజన, సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు వైద్య సిబ్బంది కృషి చేయాలని ఎంపి అంబిక లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టర్ ఓ.ఆనంద్ సూచించారు. బుధవారం ఉదయం అనంతపురం సూపర్ స్పెషాలిటీ ప్రభుత్వ ఆసుపత్రిలో కలెక్టర్, ఆస్పత్రి అభివద్ధి కమిటీ ఛైర్మన్ ఓ.ఆనంద్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కమిటీ కో ఛైర్మన్లు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, ఎంపి అంబికా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజన్ వ్యాధులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో నిత్యం ఆసుపత్రిలో అందుబాటులో ఉండి రోగులకు మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ బిల్లులు చెల్లింపు ఆలస్యం లేకుండా అందించాలన్నారు. ఎంపి అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆస్పత్రుల అభివద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ పథకం గతంలో నిర్వీర్యంగా అయిందని ప్రస్తుతం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతత్వంలోని కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో పథకం పటిష్ఠంగా అమలవుతోందని తెలిపారు. ఈ విభాగంలో ఉన్న ఉద్యోగులను తరచూ మార్చడం వల్ల ఆటంకాలు ఎదురవుతున్నందున అవసరమైతే ఉద్యోగ సిబ్బంది ఏర్పాటు ఏజెన్సీ మార్పునకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యులు రవికాంత్ రమణ తన ట్రస్టు ద్వారా 50 వీల్ చైర్లను రోగుల సౌకర్యార్థం విరాళంగా ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివద్ధి కమిటీ సభ్యుడు, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా॥కెఎల్.సుబ్రహ్మణ్యం, సభ్యులు డా॥రఘునాథన్, విశాలా ఫెర్రర్, రవికాంత్ వెంకటరమణ, గంగారాం, నరసింహులు, రత్నమయ్య, డా॥విజయశ్రీ, డిఎంహెచ్ఒ డా॥ఇబి.దేవి తదితరులు పాల్గొన్నారు.



సూపర్‌స్పెషాల్టీ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ అంబికా

ప్రభుత్వసర్వజన ఆసుపత్రి తనిఖీ

అనంతపురం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని కలెక్టర్ ఓ.ఆనంద్ బుధవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వివిధ వార్డులలో తిరుగుతూ అక్కడ ఉన్న రోగులతో మాట్లాడి వైద్యసేవలు ఎలా అందుతున్నాయన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రధాన ధ్యేయంగా సిబ్బంది పని చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరిటెండెంట్ డా॥కెఎల్.సుబ్రహ్మణ్యం, డిసిఎస్ఆర్ఎంఒ డా॥హేమలత, డా॥ఆత్మా రామ్, డా॥సతీష్, డా॥శ్రీనివాసులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

ప్రభుత్వాసుపత్రి కార్మికుల సమస్యలు పరిష్కరించండి : సిఐటియు

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

అనంతపురం జిజిహెచ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి ఎస్.నాగేంద్రకుమార్ కోరారు. ఈ మేరకు కార్మికులతో కలిసి కలెక్టర్ ఓ.ఆనంద్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్, ఏజీ.రాజమోహన్ మాట్లాడుతూ గత కాంట్రాక్టర్ ఏ-1 శానిటేషన్ ఏజెన్సీ సకాలంలో వేతనాలు చెల్లించలేదన్నారు. పిఎఫ్, ఈఎస్ఐ నేటికీ అమలు కాలేదన్నారు. ప్రస్తుతం పద్మావతి శానిటేషన్ ఏజెన్సీ 50 సంవత్సరాలు పైబడిన కార్మికులను తొలగించాలని వర్కర్లను బెదిరిస్తున్నారన్నారు. జిజిహెచ్‌లో పనిచేస్తున్న శానిటేషన్, సెక్యూరిటీ గార్డ్స్ కార్మికులకు జీవో ఎంఎస్ నెంబర్ 138 ప్రకారం వేతనాలు మంజూరు చేయాల్సి ఉందన్నారు. ఈ సమస్యలన్నింటినీ పరిశీలించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాలు నల్లమ్మ, లక్ష్మీదేవి, నరేష్ పాల్గొన్నారు.

పెన్షన్ నియమాల ధ్రువీకరణ తొలగించాలి

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఇటీవల తీసుకొచ్చిన ఆర్థిక బిల్లులో పెన్షన్ నియమాల ధ్రువీకరణ (వ్యాలిడేషన్ క్లాజ్)ను తొలగించాలని కేంద్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగ సంఘాల ఐక్య వేదిక నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేవారు. ఐక్య వేదిక ప్రతినిధుల బృందం అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మి నారాయణను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమావేశంలో ఆల్ ఇండియా బిఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ఏఐబిఎస్ఎన్ఎల్ పిడబ్ల్యుఏ) ఆల్ ఇండియా అసిస్టెంట్ జనరల్ సెక్రటరీ ఎం.రాజశేఖర రెడ్డి, టెలికాం శాఖ ప్రతినిధులు కె.పద్మనాభాచారి, ఎం.సుభాన్, ఓ.బాబయ్య, పి.బాలరంగయ్య, పోస్టల్ శాఖ ప్రతినిధులు ఆర్.సుధాకర్, శ్రీధర్ బాబు, కష్ణ ఇతర కేంద్ర శాఖల పెన్షనర్ల ప్రతినిధులు నాగేశ్వర రెడ్డి, శ్రీధర్, ఎల్ఐసి పెన్షనర్ల ప్రతినిధి సిద్దేశ్వర, జాతీయ నమూనా సర్వే (ఎన్ఎస్ఎస్ఓ) పెన్షనర్ల ప్రతినిధి నాగభూషణ, ఇన్‌కమ్ టాక్స్ శాఖ పెన్షనర్ల ప్రతినిధి నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా కూటమి పాలన : ఎంపీ, ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా పాలన జరుగుతోందని ఎంపి అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ తెలిపారు. బుక్కరాయసముద్రం అంబేద్కర్ గిరిజన గురుకుల పాఠశాల, బుక్కరాయసముద్రం నుంచి సిద్దలాపురం ఎడవలపర్తి, పప్పూరు వరకు బిటి రోడ్డుకు ఎంపి, ఎమ్మెల్యేలు బుధవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిని వేగంగా ముందుకు తీసుకెళు_న్నట్లు చెప్పారు. బుక్కరాయసముద్రంలో అంబేద్కర్ గిరిజన గురుకుల పాఠశాలను రూ.5.38కోట్లతో నిర్మిస్తున్నట్లు చెప్పారు. బుక్కరాయసముద్రం నుంచి సిద్ధాపురం ఏడవలపర్తి పప్పురు గూగూడు వరకు రూ.2.50కోట్లతో పనులు ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి సునీత, బుక్కరాయ సముద్రం సర్పంచి పార్వతి ఎంపీటీసీ కాలువ వెంకటలక్ష్మి, తహశీల్దార్ శ్రీధర్ మూర్తి, ఎంపీడీవో సాల్మన్, డిప్యూటీ ఎంపీడీవో సదాశివ, ప్రదీప్, ప్రిన్సిపాల్ హర్దనాయక్, పసుపుల నారాయణ రెడ్డి, ఓబులపతి, బాబా ఫక్రుద్దీన్, నారాయణస్వామి, చిన్న ఆంజనేయులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనుల శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

సిఎం, డిప్యూటీ సిఎం చిత్రపటాలకు పాలాభిషేకం

పంచాయతీ రాజ్ శాఖలో కార్యదర్శులకు హోదా మార్పు, గ్రేడ్‌లు కుదించి రీ గ్రేడింగ్ చేసినందుకు కృతజ్ఞతగా శింగనమల నియోజక వర్గం పంచాయతీ కార్యదర్శులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఎంపీ అంబికా లక్ష్మినారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ సమక్షంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దాసరి సునీత, ఎంపిడిఒ సాల్మన్ పాల్గొన్నారు.

జెఎన్‌టియులో అబ్దుల్ కలాంకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం



కలాంకు నివాళి అర్పిస్తున్న వైస్‌ఛాన్సలర్

మాజీ రాష్ట్రపతి డా॥ఎపిజె అబ్దుల్ కలాం గొప్ప ఉపాధ్యాయుడు, శాస్త్రవేత్త అని జెఎన్‌టియు ఉపకులపతి హెచ్. సుదర్శన రావు తెలియజేశారు. జెఎన్‌టియు విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో కలాం జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి వైస్‌ఛాన్సలర్, రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఎస్‌డి టు వీసీ ఎన్.దేవన్న తదితరులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ కలాం నిరుపేద కుటుంబం నుంచి వచ్చి శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా ఎదిగిన గొప్ప వ్యక్తి అన్నారు. యువతను మేలుకొల్పి అందరి చేత 'ది మిస్సైల్ మ్యాన్ అఫ్ ఇండియా'గా కీర్తించబడ్డాడని రిజిస్ట్రార్ తెలియజేశారు. జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర అధ్వర్యంలో అబ్దుల్ కలాంకు నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు పిఆర్.భానుమూర్తి, బి.ఈశ్వర్ రెడ్డి, వైశాలి ఘోర్పడే, పద్మ సువర్ణ, ఆర్.కిరణ్మయి, బి.దుర్గా ప్రసాద్, పి.సుజాత, విబి.చిత్ర, జి.ప్రశాంతి, ఎపి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. జెఎన్‌టియుఎ ఒటిపిఆర్ఐలో తైల సాంకేతిక, ఔషధ పరిశోధనా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంచాలకులు జీవీ.సుబ్బారెడ్డి, ప్రిన్సిపల్ డా॥సి.గోపీనాథ్, డిప్యూటీ రిజిస్ట్రార్ బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

గ్రంథాలయంలో

అబ్దుల్ కలాం 94వ జయంతి వేడుకలు జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు. కలాం చిత్రపటానికి కార్యదర్శి పి.రమా పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ లైబ్రేరియన్ పి.కమ్మన్న, అసిస్టెంట్ లైబ్రేరియన్ డి.గోవిందు, కార్యాలయ సిబ్బంది రామాంజినమ్మ, కిరణ్, జీవన, బాలచంద్ర, నాగభూషణం, బాషా, శివమ్మ పాఠకులు పాల్గొన్నారు.



గుంతకల్లులో విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలి

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

ప్రజాశక్తి-గుంతకల్లు

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాల్సిందేనని న్యాయవాదులు డిమాండ్ చేశారు. ఈ అంశంపై బుధవారం న్యాయవాదులు పట్టణంలోని బార్ అసోసియేషన్ భవనంలో సమావేశం నిర్వహించారు. విధులు బహిష్కరించాలని నిర్ణయించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జయరామ్ మాట్లాడుతూ 1953లో ఏర్పాటైన శ్రీబాగ్ ఒడంబడిక మేరకు రాయలసీమలో హైకోర్టు లేదా రాజధాని ఏర్పాటు చేయాలని ఒప్పందం జరిగిందన్నారు. అయితే ఇప్పటి వరకూ కనీసం హై కోర్టు బెంచ్ కూడా ఏర్పాటు చేయకపోవడం శోచనీయమన్నారు. ఇదుకు నిరసనగా న్యాయవాదులు ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకూ విధులు బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బార్ అసోసియేషన్ కార్యదర్శి బి.రమేష్, స్పోర్ట్స్, కల్చరల్ కార్యదర్శి బి.తిమ్మప్ప, సీనియర్ న్యాయవాదులు గోపాల్‌కృష్ణ, పి.వెంకటనాయుడు, ఎం.నాగశేషు, ఎం.చెన్నకేశవులు, వి.నాగరాజు, ఆర్.బడేసాబ్, జె.సురేష్‌కుమార్, పత్తికొండ నాగరాజు, తిమ్మారెడ్డి, వివిఎన్.రావు, మస్తాన్‌వలి, పి.బాబు, వెంకటేశులు, ధనుంజయ, రవీంద్రకుమార్, రాజశేఖర్, గురప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేయాలని కోరుతూ పట్టణంలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. జూనియర్ సివిల్ జడ్జి కోర్టు బయట నిరసన ప్రదర్శన చేపట్టారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు హొట్టే మల్లేశప్ప మాట్లాడుతూ కర్నూలులో హైకోర్టు బెంచ్ తమకు ఆమోదం కాదని, హైకోర్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

భజనమాని రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించాలి : సిపిఎం

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రధాని మోడీ కర్నూలు పర్యటనలోనైనా సిఎం చంద్రబాబు వ్యక్తిగత పొగడ్తలు మాని రాష్ట్ర ప్రయోజనాలపై చర్చించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బి.మల్లికార్జున హితవు పలికారు. మోడీ కర్నూలు పర్యటనను నిరసిస్తూ బుధవారం ఆ పార్టీ నాయకులతో కలిసి స్థానిక వినాయక కూడలిలో 'ఎపికి తీరని ద్రోహం చేసిన మోడీ గో బ్యాక్ గో బ్యాక్' అంటూ నినాదాలు చేస్తూ అరగంట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రత్యేక హోదా, విభజన హామీలు, కడప ఉక్కు, పోలవరం, ప్రత్యేక ప్యాకేజీ, ఇలా అనేక రూపాల్లో మోడి ఎపికి తీరని ద్రోహం చేశారన్నారు. జిఎస్‌టి తగ్గింపు పేరుతో ప్రజలను మభ్యపెడుతూ సంబరాలు చేసుకోవడానికి ప్రజాధనాన్ని వృథా చేస్తూ మోడీ ఎపిలో పర్యటించడం వల్ల ప్రజలకు ఒరిగిందేమీ లేదని మండిపడ్డారు. ఒకే దేశం ఒకే పన్ను పేరుతో సుమారు రూ. 55 లక్షల కోట్లను ప్రజల నుంచి లాక్కున్న కేంద్రం కేవలం రూ. 48 వేల కోట్ల భారం తగ్గించి ప్రజలందరూ పండగ చేసుకోమనడం సిగ్గుచేటన్నారు. భారత్‌పై అమెరికా పెద్ద ఎత్తున పన్నులు విధిస్తున్నా మోడీ మౌనం వహించడం ఏంటని నిలదీశారు. ఇకనైనా కూటమి ప్రభుత్వ పెద్దలు రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, మధు, తిమ్మరాజు, అంజి, రమేష్, శంకర్, కృష్ణ, నాయక్, సూరిబాబు, అశోక్‌కుమార్, ఆంజనేయులు, ఓబులేష్ తదితరులు పాల్గొన్నారు.



మోడీ గో బ్యాక్ అంటూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

పంపనూరు ఆలయ పునర్ నిర్మాణానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-ఆత్మకూరు

జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ పునర్నిర్మాణానికి నా వంతు సహకారం అందిస్తానని ఎమ్మెల్యే పరిటాల సునీత హామీ ఇచ్చారు. ఆలయ పునర్నిర్మాణంపై కమిటీ సభ్యులు, ఈఓ, డీఈ శ్రీనివాసులు, అర్చకులు బుధవారం అనంతపురంలోని క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతను కలిశారు. పలు అంశాలపై చర్చించారు. ఆలయ పునర్ని ర్మాణానికి రూ. 12 కోట్ల వరకూ ఖర్చవుతుందని వివరించారు. ఇందులో తిరుమల తిరుపతి దేవస్థా నం నుంచి ఎంత నిధులు, కామన్ గుడ్ ఫండ్ నుంచి ఎంత నిధులు తీసుకోవాలన్న అంశాలపై చర్చిం చారు. ఇప్పటికే ఆలయం తరఫున కొంత మొత్తం(మ్యాచింగ్ గ్రాంట్) ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ విషయంపై త్వరలో టిటిడి ఛైర్మన్ బిఆర్.నాయుడు, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలుద్దామని ఎమ్మెల్యే తెలిపారు. ఆలయానికి కావాల్సిన నిధులు తెప్పిం చేలా కృషి చేస్తానన్నారు.



ఆలయ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సునీత

ప్రధాని మోడీ గో బ్యాక్ : సిఐటియు

ప్రజాశక్తి-బొమ్మనహాల్

విభజన హామీలు అమలు చేయలేని ప్రధానమంత్రి నరేంద్రమోడీకి ఎపికి వచ్చే అర్హత లేదని సిఐటియు నాయకులు విమర్శించారు. మండ లంలోని ఉద్దేహాల్ గ్రామంలో హమాలీ యూనియన్ కార్యాలయం వద్ద బుధవారం సిఐటియు నాయకు లు శ్రీనివాసులు, వన్నూరుస్వామి, ఓబులేసు మాట్లా డుతూ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. విభజన సమయంలో ఎపికి ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రధాని విఫలమ య్యారన్నా రు. ప్రధానంగా ప్రత్యేక హోదా ఇవ్వలేదని, రాజధాని నిర్మాణం నేటికీ పూర్తవలేదని, ఎలాంటి ఉద్యోగావకా శాలు కల్పించలేదు, విశాఖ ఉక్కును అంచెలంచె లుగా ప్రైవేటీకరణ చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వంలో ఎపి కూటమి ఎంపిల పాత్ర కీలకమని, అయినా సిఎం చంద్రబా బు విభజన హామీలు రాబట్టడంలో విఫలమయ్యార న్నారు. వైసిపి కూడా మోడీ బానిస పార్టీగా మారిందన్నారు. జిఎస్‌టి ఎవరు తెచ్చారు.. ఎందుకు తగ్గించారు.. తగ్గించి ఉంటూ ఎందుకు అమలు కావడం లేదు.. పెట్రోల్, డీజిల్‌ను జిఎస్‌టి పరిధిలోకి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. ఇకనైనా రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి కేంద్రం నుంచి సాధించింది ఏమిటో తెలుసుకోవాలని సూచించారు. ఇప్పుడు మోడీ కర్నూలు పర్యటనతో కూడా ఎపికి ఒరిగేదేమీ లేదన్నారు. అందుకే మోడీ పర్యటనను వ్యతిరేకిస్తూ గోబ్యాక్ మోడీ అని పిలుపునిచ్చామన్నారు.

మోడీ పర్యటనకు బస్సులు.. ప్రయాణికులకు తిప్పలు

మండలం మీదుగా రోజూ కళ్యాణదుర్గం, బళ్లారి, రాయదుర్గం, ఉరవకొండ తదితర పట్టణాలకు ఆర్టీసీ బస్సులు రాకపోకలు సాగించేవి. అయితే ప్రధాని మోడీ కర్నూలు పర్యటన నేపథ్యంలో ఆయా బస్సులను జనాలను తరలించేందుకు మళ్లించడంతో బుధవారం మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలి

ప్రజాశక్తి-శింగనమల

విద్యార్థులు నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని ఎస్ఆర్ఐటి కళాశాల ప్రిన్సిపల్ డా. జి.బాలకృష్ణ సూచించారు. బుక్క రాయసముద్రం మండలంలోని రోటరీపురం గ్రామం వద్ద ఉన్న శ్రీనివాస రామానుజన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(అటానమస్) ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం 'నేషనల్ లెవెల్ టెక్నికల్ సింపోజియం-నెక్స్ జెన్-2025' పేరుతో టెక్నికల్ ఫెస్ట్‌ను ఘనంగా నిర్వహించారు. దేశంలోని వివిధ ఇంజినీరింగ్, టెక్నాలజీ కళాశాలల విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు సాంకేతిక ప్రతిభ, వినూత్న ఆలోచనలను ప్రదర్శించేందుకు ఇది ఉత్తమ వేదికగా నిలిచిందన్నారు. ప్రోగ్రామ్ కన్వీనర్ డా. జి.హేమంత్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ 1200 మంది విద్యార్థులు వివిధ ఈవెంట్లకు నమోదు చేసుకున్నట్లు వెల్లడించా రు. అనంతరం విజేత విద్యార్థులకు నగదు బహుమతి, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ డా. పి.చిత్రలింగప్ప, వైస్ ప్రెసిడెంట్ డా. ఎం. రంజిత్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డా. యు.శ్రీనివాస్, ఐక్యుఎసి డైరెక్టర్ డా. సాయి చైతన్య కిషోర్, విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



టెక్నికల్ ఫెస్ట్‌లో పాల్గొన్న ఎస్ఆర్ఐటి ప్రతినిధులు

మహిళలు ఆర్థికంగా బలపడాలి

ప్రజాశక్తి-ఆత్మకూరు

స్వయం సహాయ సంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదగాలని, సమస్యలను సైతం ఎదుర్కొనే దిశగా ఆర్థిక రంగంలో పయనించాలని ఎంపిడిఒ లక్ష్మీనరసింహ సూచించారు. స్థానిక కావేరి మండల సమైక్య కార్యాలయంలో బుధవారం 25వ మండల వార్షికోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామీణ పేద మహిళలు ప్రైవేట్ వ్యక్తులు, బ్యాంకులు, కార్పొరేట్ సంస్థల్లో అప్పులు చేసి ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి ఆర్థిక వనరులు సమకూరుస్తుందన్నారు. అలాగే అనేక రంగాల్లో శిక్షణ ఇచ్చి మహిళలను చైతన్యవంతులను చేస్తుందన్నారు. కెనరా బ్యాంక్ మేనేజర్ గురుమూర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఎపిఎం పద్మావతమ్మ, మండల సమైక్య అధ్యక్షురాలు పెద్ద లక్ష్మీదేవి, భవానీ, మండల కమిటీ సభ్యులు, సీసీలు వెంకటనారాయణ, శ్రీరాములు, కొండయ్య, అంజలి, అకౌంటెంట్ అరుణ, తదితరులు పాల్గొన్నారు.

'పివికెకె' అధ్యాపకురాలికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

నగర శివారులోని పివికెకె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో సిఎస్ఇ విభాగానికి చెందిన ప్రొఫెసర్ డా. సి.వీణ ప్రతిష్టాత్మకమైన 'డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ బెస్ట్ టీచర్ అవార్డు-2025'ను అందుకు న్నారు. 'సొసైటీ ఫర్ లర్నింగ్ టెక్నాలజీస్' సంస్థ 'సొసైటీ ఇంటర్నేషనల్ అవార్డు-2025'ను ప్రకటించింది. అవార్డును విజయవాడలోని హోటల్ మినర్వా గ్రాండ్‌లో గత సోమవారం ప్రదానం చేశారు. ఈ అవార్డును మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్-సీఈఓ, ఎఐసిటిఇ చీఫ్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్ డాక్టర్ బుద్ధ చంద్రశేఖర్ నుంచి డా. వీణ అందుకున్నారు. వీణ ఉపాధ్యాయ వృత్తిలో అందించిన విశిష్ట సేవలు, వినూత్న బోధన పద్ధతులు, విద్యార్థుల అభివృద్ధికి చేసిన అంకితభావానికి గుర్తింపుగా ఈ అవార్డు లభించినట్టు నిర్వాహకులు తెలిపారు. ఆమెను పివికెకె ఇంజినీరింగ్ కళాశాల ఛైర్మన్ డాక్టర్ పల్లె కిషోర్‌రెడ్డి, ప్రిన్సిపల్ డా. బండి రమేష్‌బాబు, వైస్ ప్రిన్సిపల్ డా. దీప్తిజ్యోత్స్న, డీన్ డా. సంతోష్ కుమార్‌రెడ్డి, ఏవో డా. మనోహర్‌రెడ్డి అభినందించారు.



అవార్డు అందుకున్న వీణతో కళాశాల యాజమాన్యం

విద్యార్థిని మృతిపై ఆర్డీవో విచారణ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

ఇటీవల స్థానిక కెజిబివిలో 9వ తరగతి విద్యార్థిని చందన అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం ఆర్డీవో వసంతబాబు కెజిబివికి వెళ్లి విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేపట్టారు. ఎస్ఓ మహాలక్ష్మి, బోధన సిబ్బంది, విద్యార్థినులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం తరగతి గదులు, వంట గదులను పరిశీలించి ఎస్ఓకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. సక్రమంగా విధులు నిర్వహించాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ఆదేశించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వెళ్లి రికార్డులను పరిశీలించారు. ఆర్డీవో వెంట తహశీల్దార్ సుమతి, ఆర్ఐ నాగిరెడ్డి, విఆర్ఓ వేణుగోపాల్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.



కెజిబివిలో విచారణ చేపట్టిన ఆర్డీవో వసంతబాబు

'భాష్యం'కు జిల్లా ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని ఇండోర్ స్టేడియంలో ఇటీవల డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ం జిల్లా ఓపెన్ తైక్వాండో ఛాంపియన్‌షిప్-2025 నగరంలోని భాష్యం పాఠశాలకు దక్కింది. ఆ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా ఉన్న పాఠశాలల విద్యార్థులు పోటీ పడగా భాష్యం విద్యార్థులు 4 రజతం, 3 సిల్వర్, 1 బ్రాంజ్ పతకాలు కైవసం చేసుకుని ఛాంపియన్ షిప్‌గా నిలిచారు. వారికి పాఠశాల ఛైర్మన్ భాష్యం రామకృష్ణ, వైస్ ఛైర్మన్ హనుమంత రావు, మేనేజింగ్ డైరెక్టర్ సాకేత్ రామ్, జిల్లా జెడివో రవివర్మ, ప్రిన్సిపల్ బాలకృష్ణ, హెచ్ఎం షకీలా బేగం మెడల్స్, సర్టిఫికెట్స్, ట్రోఫీ అందజేసి అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో యాజమాన్యం

'పిపిపి'తో పేదలకు వైద్య విద్య దూరం

వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి

వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా 'కోటి సంతకాల సేకరణ'

ప్రజాశక్తి-అనంతపురం

'పిపిపి' పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీక రణ చేయడం పేదలకు వైద్య విద్యను దూరం చేయడమేనని వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి ఆధ్వ ర్యంలో నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎదురుగా 'కోటి సంతకాల సేకరణ'కు శ్రీకారం చుట్టారు. శిబిరంలో అనంత వెంకటరామిరెడ్డి తొలి సంతకం చేసి మాట్లాడారు. సిఎం చంద్రబాబు విజనరీ పేరుతో ప్రభుత్వ ఆస్తులను ప్రైవేట్‌పరం చేస్తున్నారని మండ పడ్డారు. వైసిపి హయాంలో ప్రజలకు మెరుగైన వైద్యం, వైద్య విద్య అందించాలని భావించి రూ. 8 వేల కోట్లతో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. జగన్ పాలనలోనే కోవిడ్ తర్వాత 7 కళాశాలలు పూర్తి చేశామని, 5 కళాశాలలను అందుబాటులోకి తెచ్చామన్నారు. నిర్మా ణాలు పూర్తయినా ఎన్నికల కోడ్‌తో 2 కళాశాలలు అందుబాటులోకి రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం పిపిపి పేరుతో ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుందని, ఇది పేదలకు వైద్య విద్యను దూరం చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు తన బంధువులు, పార్టీ వాళ్లకు కళాశా లలను హస్తగతం చేయడానికి కుట్ర చేస్తున్నారన్నారు. చంద్రబాబు తీరు, కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా కోటి సంతకాలు సేకరిస్తున్నామని, ఇది పూర్తయిన తర్వాత జగన్ ఆధ్వర్యంలో గవర్నర్‌ను కలిసి అందజేస్తామన్నారు. మేధావులు, ప్రజాసంఘాలు, విద్యార్థులు, యువత, రాజకీయాలకు అతీతంగా పార్టీలు ఈ ప్రజా ఉద్యమంలో పాల్గొని అందరూ కలిసికట్టుగా ప్రభుత్వం మెడలు వంచుదామని పిలుపునిచ్చారు.



సంతకాలు సేకరిస్తున్న అనంత వెంకట్రామి రెడ్డి, వైసిపి నాయకులు

నార్పల : వైసిపి మండల కన్వీనర్ ఖాదర్‌వలిఖాన్ ఆధ్వర్యంలో మండలంలోని గూగూడు గ్రామంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ-రచ్చబండ కార్య క్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త సాకే శైలజ నాథ్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డి సంతకాలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండలంలోని ముచ్చుకుంటపల్లి, గంగనపల్లి, శోధనపల్లి, గుంజేపల్లి, నలపరెడ్డిపల్లిలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. శైలు మాట్లాడుతూ సిఎం చంద్రబాబు వైద్య కళాశాలలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి విద్యా వ్యాపారం చేయాలని భావించడం దుర్మార్గమైన ఆలోచన అన్నారు. కార్యక్రమంలో జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ నాగరత్నమ్మ, ఎంపిపి నాగేశ్వరరావు, రాష్ట్ర నాయకులు రాజగోపాల్, మిద్దె కుళ్లాయప్ప, భోగతి ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై వైసిపి నిరసన

ప్రజాశక్తి-అనంతపురం

రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యాన్ని అరికట్టాలని వైసిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుదవారం వైసిపి శ్రేణు లు ఉరవకొండ పట్టణం లోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ కూటమి పాలనలో నకిలీ మద్యం తయారీ కేంద్రాలను కుటీర పరిశ్రమలు తరహాలో ఏర్పాటు చేశారని ఆరోపించారు. నకిలీ మద్యం బారినపడి వేలాదిమంది ప్రాణాలు కోల్పోతుంటే ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. టిడిపి పాలకులు నకిలీ మద్యాన్ని ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారన్నారు. వైసిపి పాలనలో మద్యం నియంత్రణకు అనేక చర్యలు చేపట్టారన్నారు. అనంతరం ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రిస్వామి, అశోక్‌కుమార్, ఈడిగ ప్రసాద్, సర్పంచి జగదీష్, గోవిందు, ఎర్రిస్వామిరెడ్డి, బసవరాజు, ఓబులమ్మ, వసంతమ్మ, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఉరవకొండలో నిరసన తెలుపుతున్న వైసిపి నాయకులు

'అక్రమ మద్యమాంధ్రప్రదేశ్‌గా మార్చారు'

రాష్ట్రాన్ని అక్రమ మద్యమాంధ్రప్రదేశ్‌గా మారుస్తున్నారని వైసిపి మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ విమర్శించారు. అనంతపురం నగరంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం గ్రామ గ్రామాన బెల్టు షాపులు ఏర్పాటు చేసి పాలకుల వ్యక్తిగత ఖజానాకు నిధులు మళ్లిస్తున్నారన్నారు. బడి, గుడి పక్కన, ఎక్కడ చూసినా బెల్టు షాపులు పెట్టారన్నారు. పోలీసులు జనార్దన్‌రావు దగ్గర ఉండి ఓ వీడియో తీయించి జోగి రమేష్ పేరు చెప్పించారని ఆరోపించారు.

వేళకు రాని అధికారులు.. రైతుల బేజారు..!

పెద్దవడుగూరు : పెద్దవడుగూరులోని మండల వ్యవసాయ కార్యాలయానికి అధికారులు సమయానికి రాక రైతులు పడిగాపులు కాయాల్సి పరిస్థితి ఏర్పడింది. బుధవారం కోనాపురం గ్రామానికి చెందిన పలువురు రైతులు వ్యవసాయ సమాచారం కోసం అధికారుల కోసం కార్యాలయా నికి రాగా ఉదయం 11 గంటలైనా అధికారులు ఎవరూ రాకపోవడంతో అక్కడే పడిగాపులు కాశారు. 12 గంటలైనా ఎవరూ రాలేదని తెలుసుకుని వెనుదిరిగి వెళ్లిపోయారు. అధికారులు సమయ పాలన పాటించకుండా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారని పలువురు రైతులు విచారం వ్యక్తంచేశారు. వ్యవసాయాధికారి బ్యాంకు పనిపై, కార్యాలయ సిబ్బంది కొందరు పంట నమోదు కార్యక్రమానికి వెళ్లినట్లు తెలిసింది.

కార్పొరేషన్ నూతన ఎసిపిగా నీరజాక్షి

అనంతపురం కార్పొరేషన్ : అనంతపు రం మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఎం.నీరజాక్షిని నియమిస్తూ డిటిసిపి బుధ వారం ఉత్తర్వులు జారీ చేశారు. పుత్తూరు మున్సి పాలిటీ టౌన్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పని చేస్తున్న నీరజాక్షిని ఉద్యోగోన్నతి బదిలీపై ఏసీపిగా నియ మించారు. ఇక్కడ టిపిఓగా పనిచేస్తున్న శిరీషను ఉద్యోగోన్నతిపై ఆదోని మున్సిపాలిటీ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా నియమించారు.

ఎమ్మెల్యే పరామర్శ

శింగనమల : శింగనమలకు చెందిన బోయ నారాయణస్వామి భార్య బోయ నాగరత్నమ్మ అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ శింగనమలకు వెళ్లి మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మీ కుటుంబానికి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆమె వెంట మార్కెట్ యార్డ్ ఛైర్మన్ దండు శ్రీనివాసులు, ఎంపిడిఒ భాస్కర్, ఆయకట్టు ప్రెసిడెంట్ జి.సత్యనారాయణ, అనిల్‌కుమార్, రాముడు, వీఆర్వో తాతయ్య, వెంకటేష్ ఉన్నారు.

మృతుని కళ్లు దానం

నార్పల : మండల కేంద్రమైన నార్పలకు చెందిన నిమ్మకాయల రామాంజి బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతిచెందారు. పుట్టెడు దుఃఖంలో ఉండి కూడా ఆయన సతీమణి రాజేశ్వరి, కుమారుడు త్రిగుణ్, చెల్లెళ్లు భారతి, శ్రీదేవి గొప్ప మనసుతో ఆలోచించి నేత్రదానానికి ముందుకొచ్చారు. దీంతో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు వారి ఇంటికి వచ్చి రామాంజి నేత్రాలను సేకరించారు. ఇద్దరు అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు రామాంజి కుటుంబ సభ్యుల నిర్ణయాన్ని పలువురు అభినందించారు.

ట్రాక్టర్, బైక్ ఢీ.. యువకుడికి గాయాలు

రాయదుర్గం : పట్టణంలోని బిటి ప్రాజెక్టు రోడ్డు జాతీయ రహదారి కూడలి వద్ద బుధవారం మధ్యాహ్నం ట్రాక్టర్, బైక్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. గుమ్మగట్ట మండలంలోని కెపి దొడ్డి గ్రామానికి చెందిన వెంకీ బైక్‌పై రాయదుర్గం నుంచి స్వగ్రామం వెళ్తుండగా జాతీయ రహదారి కూడలి వద్ద ఉడేగోళం వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ఘటనలో వెంకీ తీవ్రంగా గాయపడగా వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

అఫ్లాటస్ గ్లోబల్ స్కూల్‌కు రాష్ట్రస్థాయిలో 5వ స్థానం

అనంతపురం : '2025-26 విద్యా సంవత్సరం భారతదేశ స్కూల్ ర్యాంకింగ్స్(కో-ఎడ్, డే స్కూల్ విభాగంలో) నగరంలోని అఫ్లాటస్ గ్లోబల్ స్కూల్‌కు రాష్ట్రంలో 5వ స్థానం, రాయలసీమ జోన్‌లో ప్రథమ స్థానం దక్కిందనిప్రిన్సిపల్, కరస్పాండెంట్ సాల్మన్ రాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అఫ్లాటస్ గ్లోబల్ స్కూల్ సాధించిన ఈ అద్భుతమైన విజయం ఎంతో సంతోషాన్ని ఇచ్చిందన్నారు. 2024-25 విద్యాసంవత్సరంలో కూడా ఎపిలో 5వ స్థానం, రాయలసీమ జోన్‌లో ప్రథమ స్థానం సాధించిచామ న్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సిబ్బందికి సహకారం వల్లే ఈ గుర్తింపు దక్కిందని తెలిపారు.



అవార్డు అందుకున్న అఫ్లాటస్ గ్లోబల్ స్కూల్ యాజమాన్యం

కోర్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం : మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్(ఫిమేల్) రెండేళ్ల కోర్స్‌లో చేరడానికి ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని డిఎంహెచ్ఒ ఈబి.దేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థినులు అర్హులన్నారు. వివరాలకు ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపల్‌ను సంప్రదించాలని తెలిపారు.

పిహెచ్‌సి మరమ్మతులు పరిశీలన

యాడికి : స్థానిక పిహెచ్‌సి భవనం శిథిలావస్థకు చేరడంతో ఇటీవల యాడికికి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే జెసి.అస్మిత్‌రెడ్డి వెంటనే మరమ్మతులు చేపట్టి ఈ నెల 20వ తేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. దీంతో నెల రోజులుగా మరమ్మతులు జరుగుతున్నా యి. ఈ క్రమంలో బుధవారం టిడిపి మండల కన్వీనర్ గొర్తి రుద్రమనాయుడు పిహెచ్‌సిని సందర్శించి పనులను పరిశీలించారు. పనులను నాణ్యతగా చేపట్టి గడువులోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట సచివాలయ ఇంజినీర్లు గణేష్, పాండురంగడు, జనసేన మండల ఉపాధ్యక్షుడు జాకీర్, టిడిపి నాయకులు నరసింహచౌదరి, నారాయణస్వామి, హాజీమస్తాన్, వెంకటేష్, చందు ఉన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

యాడికి : స్థానిక పిహెచ్‌సిని బుధవారం డిఎంహెచ్ఒ డాక్టర్ ఈబి.దేవి సందర్శించారు. సక్రమంగా విధులకు హాజరు కాని సిబ్బందికి మెమోలు ఇవ్వాలని ఆదేశించారు. అనంతరం స్థానిక కోన రోడ్డులో ఉన్న శివశంకరయ్య నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. అందులో నిబంధనలకు విరుద్ధంగా పలు ఇంజక్షన్లు, సెలైన్ బాటిల్స్, మందులను గుర్తించారు. రోగులకు ఇంజెక్షన్స్ వేస్తున్నట్టు గుర్తించి పోలీసుల సమక్షంలో సీజ్ చేశారు. అనంతరం ఆర్ఎంపికి షోకాజ్ నోటీస్ ఇచ్చారు. మరోసారి చట్ట విరుద్ధంగా వైద్యం చేస్తే క్రిమినల్ కేసు నమోదు చేస్తామని నిర్వాహకుడిని హెచ్చరించారు. డిఎంహెచ్ఒ వెంట సిఐ ఈరన్న, ఎఎస్ఐ వెంకటేష్, డాక్టర్ పరమేష్, అధికారి శ్రీనివాసులు, హెల్త్ సూపర్వైజర్ రాంప్రసాద్‌గౌడ్, శోభాకుమారి, పాల్గొన్నారు.

ప్రకృతి సంరక్షణ అందరి బాధ్యత

అనంతపురం : ప్రకృతి సంరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని ప్రధానచార్యులు మార్కండేయులు పిలుపునిచ్చారు. ఎస్‌కెయు ఆవరణలో ఉన్న కేంద్రీయ విద్యాలయంలో బుధవారం మెగా ప్లాంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. 10 రోజుల 'బ్యాగ్ లెస్ డేస్'లో భాగంగా విద్యార్థులకు 'చెట్ల పెంపకం-ప్రకృతి సంరక్షణ'పై అవగాహన కల్పించారు. సైకాలజిస్ట్, ది ఐడియల్ లివింగ్ వ్యవస్థాపకులు ఎలుగు సురేష్ కుమార్ వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇచ్చారు. ప్రధానాచార్యులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అతిథులు ప్ల కార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వందకు పైగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో భాస్కర్, అధ్యాపకులు సాయిరామ్, లలిత్, వినోద్, సుహాసిని, రామకృష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు ఇవ్వాలి

ఆత్మకూరు : ఖరీఫ్ ముగిసి రబీ సీజన్ ప్రారంభమవుతున్న దృష్ట్యా ప్రభుత్వం రైతులకు 90 శాతం రాయితీతో ప్రత్యామ్నాయ విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులు అందించాలని సిపిఎం మండల కార్యదర్శి శివశంకర్ బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రబీ సీజన్ ప్రారంభానికి ముందే వర్షాలు కురుస్తున్నందున రైతులు పంటలు సాగు చేయడానికి సిద్ధమయ్యారన్నారు. కావున ప్రభుత్వం వెంటనే రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు 90 రాయితీతో పప్పుశనగ, పెసర, అలసంద, తదితర విత్తనాలతో పాటు ఎరువులు, మందులు అందజేయాలని కోరారు.

రైల్వే కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి

అన్యాయంగా తొలగించిన రైల్వే కాంట్రాక్టు కార్మికులను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని రైల్వే కాంట్రాక్టు కార్మికుల యూనియన్(సిఐటియు) గుంతకల్లు డివిజన్ ప్రధాన కార్యదర్శి మురళి డిమాండ్ చేశారు. స్థానిక రైల్వే డీజిల్ లోకో షెడ్‌లో ఉన్న సీనియర్ డివిజనల్ మెకానికల్ ఇంజినీర్ కార్యాల యం వద్ద బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. మురళి మాట్లాడుతూ సీనియర్ డిఎంఇ రమేష్ తనకు అనుకూలంగా ఉన్న వారికే రైల్వే కార్మికుల కాంట్రాక్టు ఇప్పిచ్చారన్నారు. రైల్వే ఉన్నతాధికారాల అనుమతి లేకుండా సీనియర్ డిఎంఇ తక్కువ సమయములోనే కాంట్రాక్ట్ ఇచ్చారన్నారు. ఆ కాంట్రాక్టర్ 15 మంది కార్మికులను అన్యాయంగా తొలగించారని, వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేనిచో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైల్వే కాంట్రాక్టు కార్మికుల యూనియన్ నాయకులు రాజేష్, మధు, కేశవ, సునీల్, శ్రీనివాస్, ఆదినారాయణ, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేపట్టిన కార్మికులు

మోడీకి ఎపిలో పర్యటించే నైతిక హక్కు లేదు: గౌని

రాయదుర్గం : విభజన హామీలను పూర్తిస్థాయిలో అమలుచేయని ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి రాష్ట్రానికి వచ్చే నైతిక హక్కు వారికి లేదని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌ఛార్జి గౌని ప్రతాపరెడ్డి తెలిపారు. పట్టణంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మోడీ 2014 ఎన్నికల ముందు ఎపికి అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన తర్వాత వాటిని విస్మరించారన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో భాగస్వామ్యమైన పార్టీలు కూడా చూసీ చూడనట్టుగా స్వప్రయోజనాల కోసం రాష్ట్ర భవిష్యత్తును మోడీకి తాకట్టు పెట్టారని ఆరోపించారు. రాష్ట్రానికి రావాల్సిన నిధులు, నియామకాలపై కర్నూలు పర్యటనలో మోడీని డిమాండ్ చేసి రాష్ట్ర భవిష్యత్తును కాపాడాలని డిమాండ్ చేశారు. యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ అనిల్ మాట్లాడుతూ ప్రత్యేక హోదా, పోలవరం నిధులు, జిల్లాలకు ప్రత్యేక గుర్తింపు ఇతరత్రా విషయాలను కూడా ప్రధాన మంత్రి దృష్టికి తీసుకెళ్లి ఎపి భవిష్యత్తు కోసం పోరాడాలనీ కోరారు.

వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు సహకరించాలి

గుంతకల్లు : వడ్డెర్లు ఐక్యంగా పోరాడితే ఏదైనా సాధించుకోవచ్చని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిముని స్వామి పేర్కొన్నారు. పట్టణంలోని ధోనిముక్కల రోడ్డులో ఉన్న వడ్డెర కళ్యాణ మండపంలో బుధవారం గుత్తి, గుంతకల్లు, పామిడి మండలాల సంఘం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ముని స్వామి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహ ఏర్పాటుకు ప్రభుత్వం, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ సహకరించాలని కోరారు. అసంపూర్తిగా మిగిలిపోయిన కళ్యాణ మండపాన్ని పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలన్నారు. స్థానికసంస్థల ఎన్నికల్లో వడ్డెర్లకు ప్రాధాన్యమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఒసిసిఐ రాష్ట్ర అధ్యక్షురాలు లక్ష్మీదేవి, ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రచార కార్యదర్శి మక్కల సుధాకర్, ఆత్మ కమిటీ ఛైర్మన్ ఆనంద్‌బాబు, పామిడి సాగునీటి సంఘం అధ్యక్షులు వడ్డే సుదర్శన్‌బాబు, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులందరికీ సభ్యత్వం ఉండాలి

గుంతకల్లు : రాష్ట్రంలోని ప్రతి ఉద్యోగికీ సభ్యత్వం కల్పించాలనే లక్ష్యంతో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టామని, కావున ప్రతి ఉద్యోగి సభ్యత్వం తీసుకోవాలని ఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మాధవ్ కోరారు. స్థానిక ఎన్జీవో హోంలో బుధవారం పట్టణ అధ్యక్షులు సంపూర్ణమ్మ అధ్యక్షతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మాధవ్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి బాధ్యతగా సభ్యత్వం తీసుకోవాలని, మాసపత్రిక అందుకోవాలన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో సభ్యత్వ నమోదు చేపట్టారు.

పాఠశాలకు డెస్క్‌లు వితరణ

బెలుగుప్ప: సామాజిక బాధ్యతలో భాగంగా విర్ బ్యాక్ అనిమల్ హెల్త్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారు స్థానిక జడ్పీ హైస్కూల్‌కు రూ. 2.5 లక్షల విలువ చేసే 50 డెస్క్‌లను అందజేశారు. పాఠశాలలో బుధవా రం హెచ్ఎం వెంకటప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గుత్తి డిప్యూటీ డిఇఓ మల్లారెడ్డి, విర్ బ్యాక్ రీజినల్ జనరల్ మేనేజర్ ఓంప్రకాష్, ప్రతినిధులు రవికు మార్, తిరుపాల్‌రెడ్డి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ రమేష్, వెండర్ శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. డిప్యూటీ డీఈవో మాట్లాడుతూ వెటర్నరీ డాక్టర్ రమేష్ విర్ కంపెనీ ప్రతినిధులతో మాట్లాడి వీటిని ఇప్పించడం హర్షణీయమ న్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసి ఛైర్మన్ రుద్రయ్య, ఉపాధ్యాయ బృందం, పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలతో యుగానికి నాంది

గుత్తి : విద్యార్థులు భవిష్యత్ స్టార్టప్స్‌కు పునాది వేస్తూ నూతన ఆవిష్కరణల యుగానికి నాంది పలకాలని ప్రముఖ బిజినెస్ డెవలప్మెంట్ ట్రైనర్ బోధిసత్వ కుందు పిలుపునిచ్చారు. పట్టణ శివారులోని గేట్స్ ఇంజినీరింగ్ కళాశా లలో సయెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజుల పాటు ఐసిటి అకాడమీ అమలు చేసిన 'ఎంట్రప్రెన్యూర్‌షిప్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్' బుధవారం విజయ వంతంగా ముగిసింది. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ ఫైనల్ ఇయర్ విద్యార్థులకు స్టార్టప్స్ ప్రారంభం, వ్యాపార వ్యూహాలు, ప్రభుత్వ రాయితీలు, వ్యాపార ఆవిష్కరణలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ వికె.పద్మావతమ్మ, డైరెక్టర్ శ్రీవాణి, ఎండి రఘునాథ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ సుధాకర్, ఎఓ ఇంతియాజ్‌బాషా, ప్లేస్ మెంట్ అధికారి తన్వీర్ పాల్గొన్నారు.

అనాథాశ్రమానికి అధికారుల చేయూత

నార్పల : 'సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్'పై బుధవారం స్థానిక శ్రీసత్యసాయి అనాథాశ్రమంలో ఆశ్రమం చిన్నారుల చేత అధికారులు సాంస్కృతిక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఆశ్రమం దాతల సహకారంతో నడుస్తోందని తెలుసుకున్న ఎంపిడిఒ మమతాదేవి రూ. 5 వేలు, ఉపాధిహామీ సిబ్బంది రూ. 4,500 అందజేశారు. అలాగే ఎంపిడిఒ కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శేషారెడ్డి, ఎంఇఒ నారపరెడ్డి తమ జీవిత కాలం మొత్తం ప్రతి నెలా రూ. 500 ఆశ్రమానికి విరాళం ఇవ్వడానికి ముందుకొచ్చారు.

బాణసంచా విక్రయాలకు అనుమతి తప్పనిసరి

శింగనమల/నార్పల : బాణసంచా విక్రయాలకు అనుమతులు తప్పనిసరి అని సిఐ కౌలుట్లయ్య స్పష్టం చేశారు. దీపావళి సందర్భంగా బుధవారం సర్కిల్ పరిధిలోని శింగనమల, నార్పల, గార్లదిన్నె మండలాల్లోని టపాసుల విక్రయదారు లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సిఐ మాట్లాడుతూ అనుమతి లేకుండా టపాసుల దుకాణాలు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిర్ణయించిన ఖాళీ ప్రదేశాల్లోనే ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మండలంలోని నాగులగుడ్డంతండా సమీపంలో వున్న టపాసుల గోడౌన్‌ను తనిఖీ చేసి, అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు..?

ప్రజాశక్తి-కుందుర్పి

అధికారులు హాజరుకాని, ప్రజల సమస్యలు పరిష్కరించలేని సమావే శాలు నిర్వహించడం ఎందుకని పలువురు ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం ఎంపిపి కమల నాగ రాజు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పలువురు సభ్యులు మాట్లాడుతూ అధికా రుల గైర్హాజరీపై ప్రతి సమావేశంలో ఎంపిడిఒకు ఫిర్యాదు చేస్తున్నా ప్రయోజనం లేదని పేర్కొన్నారు. అధికారులు హాజరు కాకపోతే ప్రజల సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారను. 'వచ్చాము.. రిజిస్టర్‌లో సంతకం చేశాము.. వెళ్లిపోయాము' అనే తరహాలో అధికారులు వ్యవహరిస్తుంటే ఇక సర్వ సభ్య సమావేశం నిర్వహించడం ఎందుకని ప్రశ్నించారు. ఇకనైనా కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని అధికారులందరూ హాజరై, ప్రజల సమస్యలపై చర్చించి పరిష్క రించడానికి చర్యలు తీసుకునేలా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ప్రజాప్రతి నిధులు కోరారు. సమావేశంలో ఏవో లక్ష్మీశంకర్, డిప్యూటీ తహశీల్దార్ తిప్పే స్వామి, ఎంఇఒ తిప్పేస్వామి, సర్పంచులు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.



సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు